

రాఘవ మహరాజ్ కీ జై !

– గాంధీజీ

మీ నటన, సృజన, సమాజచింతన నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ అదృష్టం నాతో పాటు మా వాళ్లందరికీ లభించాలి.

– 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్

# 5 బళ్ళారి రాఘవ

© SCERT not to be republished

స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. 1927లో ఒకసారి గాంధీజీ బెంగుళూరును సందర్శించారు. ఆ సందర్భంగా ఆయనకు నందిహిల్స్‌లో విడిది ఏర్పాటుచేశారు.

సమయాన్ని దైవంగా భావించే గాంధీజీ దినచర్య చాలా నిర్దిష్టంగా ఉండేది. మిత్రులతో చర్చలు, సమావేశాలు, ప్రసంగాలు ఎంత ముఖ్యమో ఆయన అల్పాహారం, విశ్రాంతి, ప్రార్థనలకు అంతే ప్రాముఖ్యం ఇచ్చేవారు.

"బెంగుళూరులో మంచి నాటక ప్రదర్శన ఉంది. కొంచెంసేపు వీలు చేసుకొని, వచ్చి చూస్తారా?" అంటూ రాజాజీ చేసిన ప్రతిపాదనను నమ్మలేనట్లు చూశారు గాంధీజీ.

"ఇది మీ కార్యక్రమాలకు భంగం కలిగిస్తుందని నేననుకోను. పైగా నిరంతర కార్యమగ్నులైన మిమ్మల్ని ఈ ప్రదర్శన కొంత పునరుత్తేజితుల్ని చేస్తుందేమో...." గాంధీజీకి నాటకాలపట్ల ఉండే ఆసక్తి నెరిగిన రాజాజీ మరింత చొరవగా అన్నాడు.

"సరే....! మీరంతగా చెబుతున్నారంటే, ఏదో విశేషం ఉండే ఉంటుంది పదండి!" అంటూ లేచారు గాంధీజీ – "కాని ఒక్క షరతు! నేనెక్కువసేపు ఉండలేను. సరిగ్గా తొమ్మిదిన్నరకి ప్రార్థన చేసుకోవాలి. ఆ తర్వాత విశ్రాంతి తీసుకోవాలి గదా!" అంటూ తన కార్యవ్యగ్రతను తెలిపాడు.

అప్పుడు సరిగ్గా తొమ్మిది అవుతున్నది. ప్రదర్శనస్థలానికి వెళ్ళడానికి ఇరవై నిముషాలు పడుతుంది. అంటే ఓ పదినిముషాలు మాత్రం నాటకం చూసే వీలుంటుంది. మనసులోనే సమయాన్ని లెక్కగట్టి, వెంటనే బయల్దేరదీశారు.

అది పండిత తారానాథ్ రచించిన 'దీనబంధు కబీర్' నాటకం. కొద్దిక్షణాల్లోనే నాటకం చూడటంలో లీనమయ్యారు గాంధీజీ. అతను చెప్పిన సమయం పూర్తిగావడంతో రాజాజీ సూచనప్రాయంగా గుర్తుచేశాడు.

"వెళ్దాం.... వెళ్దాం..." అన్నాడు గాంధీజీ, 'మరికొంత సేపైన తర్వాత' అనే అర్థంవచ్చేట్టు.

మరో పదినిముషాలు...

ఇరవై నిముషాలు...

నలభై నిముషాలు....

"బాపూజీ! మీరు చెప్పిన సమయం మించిపోయింది. ప్రార్థన వేళదాటిపోతున్నది..." చెప్పక తప్పదన్నట్టు గుర్తుచేశారు రాజాజీ.

"ఇంక వేరే ప్రార్థనేం ఉంటుంది? ఇప్పుడు నేను చేస్తున్నదదే" అన్నారు దృఢంగా గాంధీజీ.

ఆశ్చర్యపోయాడు రాజాజీ. మారుమాట్లాడకుండా ఉండిపోయాడు.

పదినిముషాలు మాత్రమే నాటకం చూసి వెళ్ళాలనుకున్న గాంధీజీ, ఎనభై నిముషాలపాటు అక్కడే కదలకుండా కూర్చుండిపోయాడు.

నాటకం పూర్తయ్యింది.

"ఎవరా ప్రధాన నటుడు?" ఆరా తీశారు గాంధీజీ.

"బళ్ళారి రాఘవ!" చెప్పారు నిర్వాహకులు.

"అద్భుతం! మహాద్భుతం! రాఘవ మహారాజ్‌కీ జై!" అన్నారు హృదయపూర్వకంగా, ఆ నాటకంలోని మహానటుణ్ణి అభినందిస్తూ.

జాతిపిత గాంధీమహాత్ముని జేజేలందుకున్న ఆ మహానటుడే బళ్ళారి రాఘవ. 1909లో ఈయన స్థాపించిన 'అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్' సంస్థ ఆ ప్రదర్శన నిర్వహించింది.

1880 ఆగష్టు 2వ తేదీన అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించిన రాఘవ అసలు పేరు రాఘవాచార్యులు. తల్లిదండ్రులు శేషమ్మ, నరసింహాచార్యులు.

ప్రముఖనటులు ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావుగార్ల ప్రభావంతో 12వ ఏటనే నాటకరంగంలో ప్రవేశించిన రాఘవగారు, చదువులోను, వాక్పటిమలోనూ ఘటికులు. 1905లో మద్రాసు 'లా కళాశాల'లో పట్టాపుచ్చుకొని రాఘవ అచిరకాలంలోనే గొప్ప న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. అతని ప్రతిభను గుర్తించిన అప్పటి ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. అంతేకాదు, 'రావు బహదూర్' బిరుదంతో సత్కరించింది.

తెలుగులోనేగాక ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే ప్రతిభావైదుష్యాలు గల రాఘవ మొదట్లో షేక్స్‌పియర్ ఇంగ్లీషు నాటకాల ద్వారానే ఎక్కువ పేరు తెచ్చుకున్నాడు. బళ్ళారిలో మొదట ఈయన స్థాపించిన నాటక సంస్థ 'షేక్స్‌పియర్స్ క్లబ్.'

ఆనాటి నాటకాల్లో స్త్రీపాత్రలను పురుషులు ధరించడం, సాహిత్యంకంటే సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వడం, రావణ, కీచక, హిరణ్యకశిపాది పాత్రల్ని అతిభయంకరంగా ఆవిష్కరించడం సంప్రదాయంగా ఉండేది. ఈ సంప్రదాయాలన్నింటినీ భంగంచేసి కొత్తపద్ధతులను ప్రవేశపెట్టినవారు రాఘవ.

మైసూరులో ఒకసారి 'ప్రహ్లాద' నాటక ప్రదర్శన జరుగుతున్నది. ఆ నాటకాన్ని తిలకిస్తున్నవారిలో ముందువరసలో మహర్షిలాంటి ఒకవ్యక్తి కూర్చొని ఉన్నాడు. నాటకాన్ని సాంతం తదేక ధ్యానంతో వీక్షించాడాయన. నాటకం పూర్తయిన తర్వాత రాఘవను గట్టిగా ఆలింగనంచేసుకొని, ఆనందబాష్పాలు జాలువారగా–

"రాఘవా! మీ నటనను చూడటంతో నేను ధన్యుణ్ణయ్యాను. ఇన్నాళ్ళూ హిరణ్యకశిపుణ్ణి ఒక భయంకరమైన రాక్షసుడిగానే చూశాం. ఇప్పుడు... ఒక ధీరగంభీర హృదయవాదిగా చూడగలిగాం. 'హరిద్వేషి'గానే ఇంతవరకూ అతన్ని ఆవిష్కరించారు. ఇప్పుడు మీరు అనుపమానమైన పుత్రవాత్సల్యంగలవానిగా కళ్ళముందు సాక్షాత్కరింపజేశారు. మీ నటన, సృజన, సమాజచింతన నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. నాటకంలో సంగీతం కంటే సాహిత్యానికి, ఆంగికాభినయంకంటె సాత్వికాభినయానికి, అరుపులకంటే భావప్రకటనకూ మీరిచ్చిన ప్రాధాన్యం అభినందనీయం. ఈ అదృష్టం నాతోపాటు మావాళ్ళందరికీ లభించాలి. మీరు మా శాంతినికేతనంలో నాటకం ప్రదర్శించాలి....!" అంటూ అభ్యర్థించాడు.

ఆయనెవరో కాదు, తన గీతాంజలి కావ్యంతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన విశ్వకవి రవీంద్రులు. ఈ ప్రశంసనందుకున్న నటనాధురీణుడు బళ్ళారి రాఘవ అని చెప్పనవసరంలేదు కదా!

నాటక రంగంతోపాటు సినిమారంగంలోనూ ప్రవేశించిన రాఘవకు అక్కడి కృత్రిమత నచ్చలేదు. 1936లోనే ద్రౌపది మానసంరక్షణ చిత్రంలో దుర్యోధనుడుగా నటించాడు. రైతుబిడ్డ, చంద్రిక వంటి ఒకటి రెండు సినిమాల్లో మాత్రం అభినయించి, విరమించుకున్నాడు.

నాటకరంగాన్ని అభివృద్ధి చేయడం, ఆధునికీరించడం, వినోదంతోపాటు సామాజిక స్పృహను కలిగించడం, పేద కళాకారులను ఆదుకోవడం వంటి సంస్కరణలకు పూనుకొన్న రాఘవ 1927లోనే పాశ్చాత్య దేశాలు పర్యటించి, నాటకరంగాన్ని అధ్యయనం చేశాడు.

లార్డ్ బెర్నార్డ్ షా అంతటివాడు 10 నిముషాలకంటే ఎక్కువ సమయమివ్వలేనని చెప్పి, రాఘవతో 80 నిముషాలు ముచ్చటించాడు. "నాటకరంగ అధ్యయనానికి మీరు ఇంత దూరం వచ్చారా? మేమే మీ దేశానికి రావాలి. మేం మీదగ్గర నేర్చుకోవలసింది చాలా ఉంది" అని వినమ్రంగా ప్రకటించాడు.

ఈ విధంగా దేశవిదేశాల్లో విశేషమైన కీర్తినార్జించిన బళ్ళారి రాఘవ 1946 ఏప్రిల్ 17న జీవననాటక రంగస్థలం నుండి శాశ్వతంగా నిష్క్రమించారు. ఈ మహానటుని స్మృత్యర్థం ప్రతి ఏటా చలనచిత్ర, నాటకరంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన కళాకారులను 'బళ్ళారి రాఘవ పురస్కారం'తో సన్మానిస్తున్నారు.



బళ్ళారి రాఘవ పేరిట భారత ప్రభుత్వం విడుదల చేసిన తపాల స్టాంపు

© SCERT not to be republished

## ప్రశ్నలు

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. గాంధీజీ రాఘవ నాటకంలో లీనమైన సంఘటనను రాయండి.
2. రవీంద్రనాథ ఠాగూర్ ప్రహ్లాద నాటకం చూసి ఎలా స్పందించారు ?
3. బళ్ళారి రాఘవ నాటకరంగంలో తెచ్చిన ప్రధానమయిన మార్పులేవి?
4. బెర్నార్డ్ షా మన నాటక రంగాన్ని గురించి ఏమన్నారు?
5. బళ్ళారి రాఘవ జీవితంనుంచి మీరు పొందిన ప్రేరణ ఏమిటి?